సాక్షి
వికారాబాద్
ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



పంటల రక్షణకు పాట్లు
అడవి పందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. 10లో▸



సర్కారు బడిలో..
యాలాల మండల పరిధిలోని అగ్గనూరు ప్రాథమిక పాఠశాలలో సృజనాత్మక బోధన కొనసాగుతోంది. 10లో▸



మారని రహదారులు
కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

సెలవుపై కలెక్టర్



కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్: కలెక్టర్ ప్రతీక్‌జైన్ వారం రోజుల పాటు సెలవుపై వెళ్లారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు ఆయన సెలవులో ఉంటారు. నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు.

వక్ఫ్ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు



సుల్తాన్‌పూర్‌లో వక్ఫ్‌బోర్డు భూములను పరిశీలిస్తున్న సాజిద్ తదితరులు

పరిగి: వక్ఫ్ బోర్డు భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ సాజిద్ హెచ్చరించారు. మండలంలోని సుల్తాన్‌పూర్ దర్గా వద్ద ఉన్న వక్ఫ్ బోర్డు భూమిని కొందరు ఆక్రమించారని ఫిర్యాదు రావడంతో శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు భూములను ఆక్రమించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. వక్ఫ్ భూమిని దర్గా, శ్మశానవాటిక కోసం కేటాయిస్తే ఆక్రమించుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని అన్నారు.

సలహాలు, అభ్యర్థనలు తెలపండి

అనంతగిరి: స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లపై ఆసక్తి కలిగిన పార్టీలు, ప్రజల నుంచి అభ్యర్థనలు, సలహాలు స్వీకరించనున్నట్లు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉపేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు అన్ని పని దినాల్లో కార్యాలయ వేళల్లో(ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు) అభ్యర్థనలు, సలహాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. నగరంలోని ఖైరతాబాద్‌లో గల బీసీ కమిషన్ కార్యాలయంలో గానీ.. వచ్చే నెల 7న రంగారెడ్డి కలెక్టరేట్‌లో జరిగే బీసీ కమిషన్ బృందం ప్రజాభిప్రాయ సేకరణ ముందు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఆరో రోజు ప్రశాంతం



మొయినాబాద్‌లోని కేజీరెడ్డి కళాశాల కేంద్రంలో పర్యవేక్షిస్తున్న అధికారులు

మొయినాబాద్: గ్రూప్–1 పరీక్షలు ఆరో రోజు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పర్యవేక్షించారు. కేజీరెడ్డి కళాశాలలోని 31వ పరీక్ష కేంద్రంలో 600 మంది అభ్యర్థులకుగాను 359 మంది, 32వ పరీక్ష కేంద్రంలో 600 మందికి 349 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని సక్సెస్ చేద్దాం



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కొందుర్గు: రాష్ట్రంలోని కార్మిక, కర్షకులు ఈనెల 31న నిర్వహించే ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లేడ్ చౌదరిగూడలోని ఆర్యవైశ్య సమాజం దగ్గర ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న ఏఐటీయూసీ ఆవిర్భావం నుంచి నేటి వరకు అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, నాయకులు రమేశ్, వెంకటేశ్, చిన్నయ్య, కృష్ణ, గోపాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాల విద్యాశాఖ

తప్పుమీద తప్పు చేస్తున్న అధికారులు

- కొలిక్కి రాని కొత్త టీచర్ల నియామకం
- ఇచ్చిన ఆర్డర్ కాపీలను తిరిగి తెప్పించుకున్న వైనం
- జాయినింగ్ డేట్ మార్చి ఇస్తున్న అధికారులు
- జిల్లాకు కేటాయించిన ఉపాధ్యాయ పోస్టులు 359
- 60 పోస్టులు క్యారీ ఫార్వడ్
- 299 పోస్టులకు కౌన్సెలింగ్
- 11 మంది డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల నిలిపివేత



డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు(ఫైల్)

వికారాబాద్: విద్యాశాఖ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ఆ శాఖ తీసుకునే ప్రతి నిర్ణయం వివాదాస్పదమే అవుతోంది. ఏది చేసినా ఆ శాఖ అధికారులపై ఆరోపణలు.. విమర్శలు వస్తున్నాయి. అవగాహన లేక ఓ తప్పు చేసి దాన్ని సరిదిద్దే క్రమంలో మరో తప్పు చేసి నవ్వులపాలవుతోంది. డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభమయ్యింది మొదలు ఆ శాఖను రోజుకో వివాదం చుట్టుముడుతూనే ఉంది. కౌన్సిలింగ్‌లో ఏర్పడిన గందరగోళ పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కౌన్సెలింగ్ పంచాయితీ ఇంకా తెగడం లేదు. డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ అభ్యంతరాలు వ్యక్తమైన విషయం తెలసిందే. అనర్హులను ఎంపిక చేశారని బాధిత అభ్యర్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు, స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల ఎంపికలో, ఈడబ్ల్యూఎస్ కోటాలో ఉద్యోగాలు పొందిన వారి విషయంలో మిగతా అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులు వచ్చాయి. దీంతో వివాదం మొదలయ్యింది. ఈ సమస్య తీరక ముందే తాజాగా కొత్త టీచర్లకు ఇచ్చిన జాయినింగ్ ఆర్డర్ కాపీలను వెనక్కు తీసుకొని తేదీలు మార్చి ఇవ్వడం మరో వివాదానికి తెరలేసింది. డీఎస్సీలో జిల్లాకు 359 పోస్టులు కేటాయించగా ఆయా రిజర్వేషన్ల కేటగిరీల్లో అభ్యర్థులు లేక 60 పోస్టులు క్యారీ ఫార్వడ్ చేశారు. ఆ పోస్టులు బ్యాక్‌లాగ్ మారాయి. అవిపోను 299 పోస్టులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందులో 169 ఎస్జీటీ తెలుగు మీడియం, ఉర్దూ మీడియంలో 26 ఎస్జీటీ పోస్టులు, లాంగ్వేజ్ పండిట్స్ 23, స్కూల్ అసిస్టెంట్ 81 పోస్టులు ఉన్నాయి. ఇందులో 11మందిపై అభ్యంతరాలు రావడంతో వారి సర్టిఫికెట్లు నిలిపివేశారు. మిగిలిన 288 మంది ఉద్యోగాల్లో జాయిన్ అయ్యారు.

తేదీల మార్పుతో..

రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ అభ్యర్థులు ఈ నెల 10న జాయినింగ్ ఆర్డర్ కాపీలతో విధుల్లో చేరారు. అయితే మన జిల్లాలో ఈడబ్ల్యూఎస్, వ్యాయామ ఉపాధ్యాయులు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, లాంగ్వేజ్ పండిట్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో తలెత్తిన వివాదాల కారణంగా కొత్త టీచర్లకందరికీ 16వ తేదీతో జిల్లా విద్యాశాఖ జాయినింగ్ ఆర్డర్ కాపీలు ఇచ్చింది. దీంతో మిగతా జిల్లాల అభ్యర్థులతో పోలిస్తే తమ సీనియారిటీ తగ్గుతుందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో దిగివచ్చిన విద్యాశాఖ ఆ పొరపాటును సరిదిద్దేందుకు ఇచ్చిన ఆర్డర్ కాపీలను మూడు రోజుల నుంచి ఎంఈఓలు, గెజిటెడ్ హెచ్‌ఎంల ద్వారా తిరిగి తెప్పించుకుంది. జాయినింగ్ డేట్‌ను 16వ తేదీ నుంచి 10వ తేదీగా మార్చారు. వీటిని శనివారం ఎంఈఓలకు పంపారు. గత కౌన్సిలింగ్‌లో చాలా మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో మాత్రం రిలీవర్ వచ్చే వరకు అక్కడే కొనసాగించారు. వారు కొత్త టీచర్లు రాకతో రిలీవ్ అయ్యారు. ఈ క్రమంలో కొత్త టీచర్లకు ముందుగా జాయినింగ్ ఆర్డర్ కాపీలపై 16వ తేదీ వేసి ఇవ్వడంతో వారు జాయిన్ అయిన స్థానాల నుంచి రిలీవ్ అయి వెళ్లిన ఉపాధ్యాయులకు 16వ తేదీన రిలీవ్ కాపీలు ఇచ్చారు. అయితే కొత్త వారికి జాయినింగ్ ఆర్డర్ కాపీలను తిరిగి 10వ తేదీతో ఇవ్వడంతో పాతవారికి రిలీవింగ్ ఆర్డర్లు ఈ నెల 9వ తేదీనే వేయాల్సి ఉంది. వారి ఆర్డర్ కాపీలపై 16వ తేదీ ఉండటంతో వారికి అటు ముందు పని చేసిన పాఠశాలలో ఇటు బదిలీపై వెళ్లిన పాఠశాలలోనూ ఈ నెల వేతన బిల్లులు చేయడం లేదు. దీంతో ఈ నెల వేతనాల పరిస్థితి ఏంటని ఆందోళనకు గురవుతున్నారు. మిగతా జిల్లాల్లో బదిలీ అయిన వారికి రిలీవింగ్ ఆర్డర్ కాపీ 9వ తేదీ ఇవ్వడంతో తమకు కూడా అదే తేదీ రిలీవింగ్ ఆర్డర్ ఇచ్చి ఈ నెల వేతనాలు బదిలీపై వెళ్లిన పాఠశాలలో చేసేలా చూడాలని వారు కోరుతున్నారు.

అన్నీ వివాదాలే..

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలు జిల్లా విద్యాశాఖ వివాదాలకు.. అవగాహన రాహిత్యానికి, నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. సర్టిఫికెట్ల పరిశీలనలో జరిగిన అవకతవకల వల్ల అనర్హులకు ఉద్యోగాలు వచ్చాయని బాధిత అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరు వల్ల తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు దాంతో పాటు ఆర్‌సీఐ(రీ హ్యాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) సర్టిఫికెట్ వ్యాలిడిటీ ఉండాలి. వీరిలో నలుగురు అభ్యర్థులకు ఆర్‌సీఐ సర్టిఫికెట్ వ్యాలిడిటీ లేకపోయినా ఎంపిక చేశారని బాధితులు తెలిపారు. వీటితో పాటు పీడీ పోస్టుల ఎంపికలోనూ అవకతవకలు జరిగాయని బాధితులు వాపోతున్నారు. పీడీ పోస్టులు మూడు ఉండగా వన్ ఈస్టు త్రీ చొప్పున తొమ్మిది మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి ముగ్గురిని ఎంపిక చేయాలి. అయితే ఎంపికైన అభ్యర్థులు వన్ ఈస్టు త్రీ జాబితాలో లేరని పేర్కొన్నారు. ఇదే సమయంలో లాంగ్వేజ్ పండిట్స్ నలుగురు, ఈ డబ్ల్యూఎస్ సర్టిఫికెట్లపై వచ్చిన అభ్యంతరాలతో 10 మంది కలుపుకొని మొత్తం 21 మంది అభ్యర్థుల ఆర్డర్ కాపీలను పక్కన పెట్టారు. అభ్యంతరాలను పరిశీలించేందుకు ఫైవ్ మెన్ కమిటీ వేయగా వారు 10మంది ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల సమస్యను పరిష్కరించారు. మిగిలిన 11 మంది సర్టిఫికెట్లను పెండింగ్‌లో పెట్టారు. ఈ వివాదం ఎప్పటికి పరిష్కారమవుతుందో వేచి చూడాల్సి ఉంది.



పరిగి: హనుమాన్ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న శ్రీనివాస్ తదితరులు

ప్రైవేట్ క్లినిక్‌లలో తనిఖీలు

- నకిలీ డాక్టర్లపై కేసులు నమోదు చేస్తాం
- మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్

పరిగి: ఎలాంటి విద్యార్హత లేకుండా రోగులకు చికిత్స చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. శనివారం పరిగి పట్టణంలోని పలు క్లినిక్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనిఖీల్లో 10 మంది నకిలీ డాక్టర్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టణంలోని యాసిన్, హనుమాన్, గ్లోబల్, రాఘవేంద్ర క్లినిక్‌లను తనిఖీ చేశామన్నారు. అర్హత లేని వారు వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజీఎంసీ అకడమిక్ కమిటీ చైర్మన్ ఆనంద్, సభ్యులు అరుంధతి, ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో..

అనంతగిరి: పట్టణంలోని పలు క్లినిక్‌లను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రులు నిబంధనల ప్రకారం కొనసాగుతున్నాయా లేదా అని పరిశీలించారు. వైద్యుల అర్హత, ఆస్పత్రికి అనుమతి ఉందా అనే విషయాల తోపాటు బయో మెడికల్ వేస్టేజ్ డిస్పోజ్ చేస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న మందులపై ఆరా తీశారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని బృందం సభ్యులు తెలిపారు.

తాండూరులో..

తాండూరు: పట్టణంలోని పలు ప్రైవేట్ క్లినిక్స్‌పై శనివారం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర బృందం ఆకస్మిక దాడులు చేసింది. 10మందితో కూడిన బృందం పట్టణంలోని పలు ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌ల్లో తనిఖీలు చేసింది. పాత కూరగాయల మార్కెట్ ప్రాంతంలోని మూడు క్లినిక్‌లు, వినాయక్ చౌక్, కోర్టు వెనుక ఉన్న ఒక్కో క్లినిక్ నుంచి మందులు, సలైన్ బాటిల్లు, ఇంజెక్షన్లను సీజ్ చేశారు.

దర్గాలో స్పీకర్ పూజలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లిలోని మహబూబ్ సుభాన్ దర్గాలో జరిగిన సందల్ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన చాదర్, పూలు సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరక్టర్ కిషన్‌నాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు జహంగీర్ ఖాన్, ఎండీ హాశం, అఫ్జల్‌ఖాన్, నజీర్, గౌస్, ముజాయిద్ తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో చాదర్, పూలు సమర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



పవన్ చౌహాన్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్

షాద్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించిన ‘చలో సెక్రటేరియేట్’కు షాద్‌నగర్ నుంచి పవన్ చౌహాన్ ఆధ్వర్యంలో నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే వారిని అణగొక్కేందుకు అరెస్టులు చేయించడం సరి కాదన్నారు.

ఉపాధి కల్పనకు ప్రత్యేక కార్యాచరణ

ఆమనగల్లు: వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని నాగర్‌కర్నూల్ ఎంపీ, పార్లమెంటరీ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు డా.మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శమన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో రుణమేళా కార్యక్రమానికి వెళ్తున్న ఎంపీ, ఎమ్మెల్యేను కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. యువత నైపుణ్యశిక్షణ పొంది ప్రపంచ స్థాయిలో రాణించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్యేయమని చెప్పారు. విపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, పార్టీ నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌నాయక్, ఖలీల్, మల్లయ్య, సత్యం పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి శిక్షణ కేంద్రాలు

కడ్తాల్: యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శనివారం వారు అచ్చంపేటకు వెళ్తూ కడ్తాల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికాయి. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో అవగాహన కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలను పార్లమెంట్ పరిధిలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్లమెంట్ పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు యత్నిస్తున్నట్లు చెప్పారు.

‘సహకారం’లో స్వాహాల గుర్తింపు!

- గ్యారంటీ లేకుండా రుణాల మంజూరు
- కందుకూరు డీసీసీబీలో రట్టయిన అక్రమాల గుట్టు
- ఇప్పటికే మేనేజర్‌పై వేటు.. కేసు నమోదుకు సిఫార్సు
- బదిలీపై వెళ్లాల్సిందిగా కార్యదర్శికి పాలకవర్గం హుకూం
- ‘సాక్షి’ కథనానికి స్పందన



సాక్షి, రంగారెడ్డిజిల్లా: సహకార బ్యాంకులో చోటు చేసుకున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇంటి నిర్మాణం, వాహనాల కొనుగోలు, వ్యాపార పెట్టుబడి, వ్యక్తిగత రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, మార్టిగేజ్ రుణాల మంజూరీలో బ్యాంకు మేనేజర్లు, కార్యదర్శులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తేలింది. కందుకూరు డీసీసీబీలో ఎలాంటి గ్యారంటీలు లేకుండా బినామీల పేరుతో రూ.43 లక్షలకుపైగా రుణాలు మంజూరు చేసి, స్వాహా చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ఇప్పటికే బ్యాంకు మేనేజర్‌పై డీసీసీబీ వేటు వేసింది. ఈ స్వాహా కార్యానికి పాల్పడిన మేనేజర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నిర్ణయించి పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ‘స్వాహాకారం’ శీర్షికన ఇటీవల ‘సాక్షి’ లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇదే అంశంపై కందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. చైర్మన్ సహా సభ్యులు పాల్గొన్నారు. రుణాల మంజూరు పేరుతో బ్యాంక్ మేనేజర్ సహా పీఏసీఎస్ కార్యదర్శి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. కార్యదర్శిని తక్షణమే ఇక్కడి నుంచి బదిలీ చేయాలని డీసీసీబీ సీఈఓకు విజ్ఞప్తి చేశారు. కార్యదర్శి 27 ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోయారని, ఆయన్ను తక్షణం బదిలీ చేయాలని పట్టుబట్టారు. అప్పటికే ఆయన తనను మరో చోటికి బదిలీ చేయాలని కేంద్ర కార్యాలయానికి రిక్వెస్ట్ పెట్టడం, కార్యవర్గం ఆమెద ముద్ర వేయడం చకచకా జరిగిపోయాయి.

దివాలా అంచున బ్యాంకులు

జిల్లాలో 37 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉండగా, వీటిలో 1,66,105 మంది సభ్యులు ఉన్నారు. వీటిలో ఏటా రూ.374 కోట్ల టర్నోవర్ నమోదవుతోంది. ఏడాదికి రూ.25 కోట్లకుపైగా టర్నోవర్‌ను కలిగిన ఉన్న (కందుకూరు, తుర్కయంజాల్, బాటసింగారం, మంచాల, యాచారం)పీఏసీఎస్‌లను ‘ఎ’ గ్రేడ్ జాబితాలో చూపించారు. అంతకంటే తక్కువ టర్నోవర్ కలిగి ఉన్న వాటిని (కొందుర్గు, ఉప్పరిగూడ, చేగూరు, మొయినాబాద్, ఆలూరు, గుండాల్, షాబాద్, మహేశ్వరం)‘బి’ గ్రేడ్ జాబితాలో చూపారు. రుణాల మంజూరు, రికవరీ విషయంలో 50 శాతం కంటే తక్కువ కలెక్షన్ ఉన్న మెకిల, భాగ్యనగర్, చిన్న గోల్కొండ, మల్కారం, పాలమాకుల, బండ్లగూడ, నార్సింగి, రాయదుర్గం, హైదర్షకోట్, చేవెళ్ల, ముడిమ్యాల, నందిగామ, కొత్తపేట, మేకగూడ, షాద్‌నగర్, హయత్‌నగర్, పటేల్‌గూడ, పొల్కంపల్లి, తలకొండపల్లి, మాడ్గుల పీఏసీఎస్‌లను ‘సి’ గ్రేడ్ జాబితాలో చూపారు. చైర్మన్లు, బ్యాంకు మేనేజర్లు, కార్యదర్శులు కలిసి అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. తక్కువ వడ్డీకి రైతులకు రుణాలు మంజూరు చేయాల్సిన అధికారులు.. కమీషన్లు ఎక్కువ ఇచ్చే గ్యారంటీ లేని అనర్హులకు ఎక్కువ మొత్తంలో రుణాలు ఇస్తున్నట్లు సమాచారం. తలాపాపం తిలాపిడికెడు అన్నట్లు లోన్ల ప్రాసెస్ కోసం రైతులు, ఇతర రుణగ్రస్తుల నుంచి వసూలు చేసే కమీషన్లను ఈ ముగ్గురు కలిసి పంచుకుంటున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. పరోక్షంగా వీరు బ్యాంకులు ఆర్థికంగా దివాలా తీయడానికి కారణమవుతున్నారు. ఎప్పటికప్పుడు ఆయా బ్యాంకుల్లో తనిఖీలు నిర్వహించి, లోన్ల మంజూరు, రికవరీలపై దృష్టిసారించాల్సిన డీసీసీబీ కేంద్ర బ్యాంకు అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం కూడా వారికి వరంగా మారుతోంది.

మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు • ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ నిర్వహణపై సీఐ రాఘవేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ విభాగాల పనితీరు, ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి.. నేరాలను అరికట్టడం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సమస్యాత్మక ప్రాంతాల విషయంలో ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ సుధీర్‌బాబు

క్లుప్తంగా

జనన నియంత్రణ కేంద్రానికి శునకాలు

కొడంగల్ రూరల్: మున్సిపాలిటీతోపాటు మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లోని శునకాలను జనన నియంత్రణ కేంద్రానికి తరలిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తెలిపారు. శనివారం మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామంలో శునకాలను బంధించి పట్టణంలోని పశువైద్యశాలలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన జనన నియంత్రణ కేంద్రానికి తరలించారు. గ్రామాల్లో శునకాల బెడద తీవ్రం కావడంతో అధికారులు శునకాలకు శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్, గ్రామస్తులు రాములు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో కేటీఆర్

కొడంగల్: బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద కిష్టప్ప శనివారం 'ఏనుగు' దిగి 'కారు'ఎక్కారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సమావేశం ఏర్పాటు చేసి బీఎస్పీ పార్టీకి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆమె గులాబీ కండువా కప్పారు. ఐదేళ్లుగా తటస్థంగా ఉన్న కొడంగల్ మాజీ ఎంపీపీ కన్నం దయాకర్‌రెడ్డికి కేటీఆర్ పార్టీ కండువా కప్పారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇకపై పార్టీలో చురుగ్గా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రామకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, సలీం, మధు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంలో మంటలు



కాలిబూడిదైన బైక్

పరిగి: కదులుతున్న ద్విచక్ర వాహనం నుంచి మంటలు చెలరేగి బైక్ కాలిబూడిదయింది. ఈ ఘటన మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి సుగుణ ఫ్యాక్టరీ ఎదుట శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. సయ్యద్‌పల్లి గ్రామానికి చెందిన నర్సింహులు పరిగి నుంచి ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో బైక్ నుంచి చిన్నగా మంటలు వస్తుండడం గమనించాడు. దీంతో ఆపి చూస్తుండగానే ఒక్కసారిగి మంటలు చెలరేగి బైక్ కాలిబూడిదయింది.

రుద్రాక్ష, విబూది ఇచ్చి..

- విశ్రాంత ఉపాధ్యాయుడి ఉంగరం తస్కరణ
- నలుగురు నిందితులకు రిమాండ్

యాచారం: సాధువుల వేషధారణతో వచ్చిన నలుగురు వ్యక్తులు ఓ రిటైర్డ్ టీచర్‌కు రుద్రాక్ష, విబూది, ఇచ్చి బంగారు ఉంగరాన్ని దోచుకెళ్లారు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. సీఐ శంకర్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన కవార్నాథ్, సామ్‌నాథ్, పర్దేశినాథ్, ప్రేమ్‌నాథ్ శుక్రవారం సాగర్‌రోడ్డుపై తక్కళ్లపల్లి గేట్ వద్ద తక్కళ్లపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్ దెంది మాదవరెడ్డిని కలిశారు. సమీపంలో ఆలయాలు ఉంటే చెప్పాలని కోరారు. ఆయన్ను మాటల్లో పెట్టి ఓ రుద్రాక్ష, విబూధి ఇచ్చారు. ఉంగరం ఇస్తే పూజ చేసి ఇస్తామని నమ్మించారు. చేతికున్న ఉంగరం ఇవ్వగానే వారు అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో ఆ విశ్రాంత ఉపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం మాల్ చెక్‌పోస్ట్ వద్ద నలుగురు సాధువులు సంచరిస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా తామే ఉంగరం దొంగిలించినట్లు ఒప్పుకొన్నారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

డిజిటల్ క్రాప్ సర్వేకు ఓకే..

- వ్యవసాయ శాఖ, ఏఈఓల చర్చలు సఫలం
- నెల రోజులు ఆలస్యంగా ప్రారంభమైన సర్వే
- పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఏఈఓలు



నస్కల్ గ్రామంలో డిజిటల్ యాప్‌లో పంట నమోదు చేస్తున్న ఏఈఓ కావ్య



వరి పంటను డిజిటల్ యాప్‌లో నమోదు చేస్తున్న ఏఈఓ శిరీష

దోమ: డిజిటల్ క్రాప్ సర్వే అడ్డంకులు ఎట్టకేలకు తొలిగాయి. రైతులు సాగు చేసిన పంట వివరాలు నమోదు చేసేందుకు తీసుకువచ్చిన డిజిటల్ క్రాప్ సర్వేను ఏఈఓలు ప్రారంభించారు. ఈ సర్వే ఒక్కరితో కాదని తమకు సహాయకులను ఇవ్వాలని డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ విస్తరణ అధికారులు నెల రోజులుగా సర్వేకు దూరంగా ఉన్నారు. రైతుబీమా మార్గదర్శకాలు పాటించలేదనే నెపంతో ఇటీవల 165 మంది ఏఈఓలను సస్పెండ్ చేయంతో వారిపై మానసిక ఒత్తిడి పెంచిన ప్రభుత్వం వారు సర్వే చేపట్టేలా చేసింది. సస్పెన్షన్‌పై ఆందోళన చేసిన ఏఈఓలతో చర్చించిన వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని, సర్వే చేపట్టాలని సూచించింది. దీంతో వారు సర్వేబాట పట్టారు. సెప్టెంబర్ 24న ప్రారంభించాల్సిన సర్వే రెండు రోజుల క్రితం మొదలైంది. మొబైల్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నిర్దేశించిన మార్గాదర్శకాల మేరకు పంట నమోదు చేపడుతున్నారు. గ్రామాలకు దూరంగా ఉన్న పంట పాలాలకు తోడు లేకుండా వెళ్లి సర్వే చేయాలంటే ఏఓఈలు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యలను అధిగమించేదెలా?

జిల్లా వ్యాప్తంగా వంద మంది ఏఈఓలు ఉన్నారు. ప్రభుత్వం డిజిటల్ క్రాప్ చేపట్టాలని సూచించడంతో క్షేత్ర స్థాయిలో వెళ్లి పంటలను పరిశీలించి పంట నమోదు చేస్తున్నారు. కానీ పంట నమోదులో తీవ్ర ఇబ్బందులు, వివిధ రకాల సమస్యలు ఎదురవుతున్నాయని వాటిని ఎలా అధిగమించాలని ఏఈఓలు ప్రశ్నిస్తున్నారు.

నెట్‌వర్క్ సమస్యలతో ఇబ్బంది

నెట్‌వర్క్ సమస్యల కారణంగా యాప్ ఓపెన్ కాకపోవడం, గ్రామ డేటా డౌన్లోడ్ అవ్వడం లేదని వాపోతున్నారు. ఒకే సర్వే నంబర్‌పై ఇతర రైతుల వివరాలు చూపుతున్నాయని వెల్లడిస్తున్నారు. పంట వివరాలు నమోదు చేసినప్పటికీ ఫొటో అప్లోడ్, సబ్మిట్ కాకపోవడం, లోకేషన్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సర్వే పూర్తైన పొలాలకు తిరిగి లోకేషన్ చూపడం, యాప్‌లో రైతుల వివరాలను చూపిస్తే ఇది మా పొలం కాదని రైతులు చెప్పడం, పొలాలకు వెళ్లే దారులు సక్రమంగా లేకపోవడం, ఒంటరిగా వెళ్లాలంటే ఇబ్బందులు రావడం, పాములు, విద్యుత్ తీగలతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. వాగులు దాటడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు.

యాప్ ఓపెన్ కావడం లేదు



క్షేత్ర స్థాయిలో వెళ్లి డిజిటల్ క్రాప్ సర్వే చేసేందుకు వెళ్లగా నెట్‌వర్కింగ్ సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో పంట వివరాలు యాప్‌లో ఓపెన్ కావడం లేదు. ఓపెన్ అయినా రైతుల వివరాలు యాప్ సక్రమంగా చూపకపోవడం ఇబ్బందులు పడుతున్నాం. ఒక రైతు దగ్గరకు వెళితే మరో రైతు పంట పొలాలు చూపిస్తున్నాయి. – కావ్య, ఏఈఓ, నస్కల్

సహాయకులను నియమించాలి



డిజిటల్ క్రాప్ సర్వేకు తాము సిద్ధంగా ఉన్నాం. కానీ పంటపొలాలకు వెళ్లాలంటేనే జంకుతున్నాం. దారులు ముళ్ల కంచెలు, వాగులు, వంకలు ఉండడం, పాములు కనిపించడం తదితర పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఒంటరిగా వెళ్లాలంటేనే భయమేస్తోంది. సహాయకులను నియమిస్తే తమకు మేలు చేకూరుతుంది. – స్వాతి, ఏఈఓ, బొంరాస్‌పేట్

పంటల రక్షణకు పాట్లు

- పంటలపై అడవి పందుల దాడి
- చుట్టూ చీరలు కట్టినా తగ్గని బెడద
- పొలాల వద్దే రైతుల జాగరణ



దౌల్తాబాద్‌లో పంట రక్షణ కోసం కట్టిన చీరలు

దౌల్తాబాద్: రైతులు పంటలు కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. వానాకాలం పంటలు వేసిన నాటి నుంచి రాత్రి, పగలు పొలాల వద్దే పడిగాపులుకాస్తున్నారు. ఎంత శ్రమించినా అడవిపందుల బెడద కారణంగా చేతికి వచ్చిన పంట పాడవుతోందని ఆవేదన వెళ్లిబుచ్చుతున్నారు. గత పంట నష్టాన్ని పూడ్చుకుందామని వేసిన వానాకాలం పంటలు సైతం అడవిపందుల కారణంగా నష్టపోతుండడంతో చేసేదేమి లేక తలపట్టుకుంటున్నారు. అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు పంట చుట్టూ చీరలు కడుతున్నారు. మండల పరిధిలోని తిర్మలాపూర్, అంతారం, దౌల్తాబాద్, నందారం, కుదురుమళ్ళ, నీటూరు, నర్సాపూర్ తదితర గ్రామాల్లో జొన్న, మొక్కజొన్న, చిక్కుడు, టమాట, వేరుశనగపంటలను సాగు చేస్తున్నారు. ఈ పంటలను రక్షించుకోవడానికి రైతులు పంటల చుట్టూ రంగురంగుల చీరలను, వైర్లు, పలురంగుల జెండాలు, చెట్లకు ఖాళీ సీసాలు కట్టి అందులో రాళ్ళు వేస్తున్నారు. అంతేకాకుండా రాత్రి వేళలో పంటపొలాల వద్ద టపాకాయలు కాల్చడం తదితరాలు చేస్తున్నారు. అయినప్పటికీ అడవి పందులు గుంపులుగా పంటలపై దాడి చేసి నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. అడవి పందులను నివారించి తమ పంటలను కాపాడలని రైతులు కోరుతున్నారు. హైదరాబాద్‌లో ఒక్కో చీరకు రూ. 30 నుంచి రూ.40 చెల్లించి కొనుగోలు చేస్తున్నామని రైతులు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ సంఘం నాయకులు, విద్యార్థులు

పరిగి: విద్యార్థుల సమస్యలను పరిష్కరించంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ ఆరోపించాడు. శనివారం ఆయన విద్యార్థులతో కలిసి ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పట్టణ కేంద్రంలోని ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కాలయాపన చేస్తోందన్నారు. పెరిగిన ధరలకు స్కాలర్‌షిప్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీలు అమలు చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నలుగురు

- కుల్కచర్ల జెడ్పీహెచ్ఎస్ నుంచి ఐశ్వర్య, చందన
- కొడంగల్ జెడ్పీహెచ్ఎస్ నుంచి వీరేశ్, లచ్చానాయక్



కుల్కచర్ల: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు



కొడంగల్ రూరల్: విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో సాల్వీడు జెడ్పీహెచ్ఎస్ నుంచి ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం అండర్–14 విభాగంలో ఎంపికైన ఐశ్వర్య, అండర్–17 విభాగంలో ఎంపికైన చందనను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరక్టర్ కొండయ్య, పాఠశాల హెచ్ఎం రాంచందర్, పీఈటీ కేశవులు, ఉపాధ్యాయులు మన్నన్, స్వయంప్రకాశ్, తులసీనాయక్, వెంకటేష్, రమేష్, ప్రసాద్, సంతోషి, మాజీ సర్పంచ్ బాలయ్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ యాదమ్మ, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, నాయకులు శ్రీనివాసులు, జగదీశ్వర్ పాల్గొన్నారు.

కొడంగల్ జెడ్పీహెచ్ఎస్ నుంచి ఇద్దరు

కొడంగల్ రూరల్: జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తాచాటిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు అజీజ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు వీరేశ్, లచ్చానాయక్‌ను పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మురళీధర్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడాపోటీల్లో ప్రతిభ చాటడం ఆనందంగా ఉందని.. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ నెల 28 నుంచి 30 వరకు కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొనేందుకు వెళ్లనున్నట్లు తెలిపారు.

సర్కార్ బడిలో చక్కని బోధన



తయారు చేసుకున్న రాఖీ బాండ్ చూపుతున్న విద్యార్థులు(ఫైల్)



నవోదయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న మురహరినాథ్ (ఫైల్)

- అగ్గనూరు పాఠశాలలో సృజనాత్మక పెంపొందించేలా ప్రాజెక్టులు
- నవోదయ పరీక్షకు ప్రత్యేక శిక్షణ
- కృత్యాధార బోధనలో ఉత్సాహంగా భాగస్వాములవుతున్న విద్యార్థులు

యాలాల: మండల పరిధిలోని అగ్గనూరు ప్రాథమిక పాఠశాలలో సృజనాత్మక బోధన కొనసాగుతోంది. ప్రైవేటుకు దీటుగా విద్యాభోదన, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులను భాగస్వాములను చేయడంతో వారు సైతం శ్రద్ధతో నేర్చుకుంటున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 వరకు 84 మంది విద్యార్థులున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు వైవిధ్యంగా బోధిస్తున్నారు విద్యార్థుల హాజరు నుంచి ప్రతి రోజు విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా కొత్త ప్రాజెక్టులను ఇక్కడి ఉపాధ్యాయులు నేర్పిస్తున్నారు. విద్యార్థులే స్వయంగా కాగితపు తయారు చేసిన ప్రాజెక్టులు, మట్టితో తయారుచేసిన ప్రతిమలు, బొమ్మలు, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్, కమలం పువ్వుల తయారీ లాంటి వాటిని తయారు చేసే పనిలో విద్యార్థులు ఎంతో చురుగ్గా పాల్గొంటున్నారు.

హరివిల్లు జాయ్‌ఫుల్ లెర్నింగ్ పద్ధతులు

పాఠశాలలోని ఉపాధ్యాయుడు మురహరినాథ్ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా ప్రతి రోజు కొత్త కార్యక్రమాలను చేపడుతున్నారు. నవోదయ పరీక్షకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు హరివిల్లు ఫౌండేషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రతి రోజు జాయ్‌ఫుల్ లెర్నింగ్‌లో కొత్త విషయాలను నేర్పిస్తున్నారు. ఎఫ్ఎల్ఎన్ విధానంతో విద్యార్థులు సొంతంగా ఆలోచించి రాసే వర్క్‌బుక్‌ల తయారీ, ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందిచేందుకు తరగతి వారీగా క్రమశిక్షణ కమిటీ, పారిశుద్ధ్య కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులు తమ ఇంటి వద్ద ప్రత్యేకంగా రీడింగ్ కార్నర్ ఏర్పాటు చేసుకుని చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారు. క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల పురోగాభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారు.

మెరుగైన బోధన



ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన భోదన అందుతుంది. పాఠశాలలో వివిధ రకాల కార్యక్రమాలు, వసతులు కల్పించడానికి దాతలు, సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో చక్కగా బోధిస్తున్నాం. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి, విద్యార్థుల ఉన్నతికి పాటుపడేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – మొగులయ్య, హెచ్ఎం, అగ్గనూరు పాఠశాల

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



అనంతయ్య మృతదేహం

పరిగి: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. పట్టణ కేంద్రంలోని భవాని హోటల్ వెనుకాల చెట్ల పొదల్లో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మున్సిపల్ పరిధిలోని ఎర్రగడ్డపల్లి గ్రామానికి చెందిన అనంతయ్య(60)గా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువకుడి అదృశ్యం



రాణా ప్రతాప్(ఫైల్)

పూడూరు: ఫంక్షన్ వచ్చిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. నవాబుపేట మండలం అక్నాపూర్‌కు చెందిన పెద్దగొళ్ల శ్రీకాంత్ శుక్రవారం రాత్రి మండల పరిధిలోని చీలాపూర్‌లో తన కూతురు తొట్టెల(పురుడు) ఫంక్షన్ జరిపించాడు. శ్రీకాంత్‌కు వరుసకు సోదరుడైన రాణాప్రతాప్ (28) ఫంక్షన్ వచ్చి రాత్రి 8:30గంటల ప్రాంతంలో బయటకు వెళ్లి వస్తానన్నాడు. తిరిగి రాకపోవడంతో ఫోన్ చేశారు. స్విచ్ఛాఫ్ రావడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

వృద్ధుడి అదృశ్యం



బాలరాజ్‌గౌడ్ (ఫైల్)

కేశంపేట: వ్యవసాయ పొలానికి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని కాకునూర్‌లో శనివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బాల్‌రాజ్‌గౌడ్(70) తన వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 25న ఉదయం పొలానికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దీంతో కు టుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలిస్తుండగా జడ్చర్ల మండలం గంగాపూర్ లో వృద్ధుడు కనిపించినట్లు ఓ హోటల్ నిర్వాహకులు సమాచారం ఇచ్చారు. అక్కడ వెతికినా వృద్ధుడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆయన కుమారుడు శివశంకర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ సోషలిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు

షాబాద్: తెలంగాణ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నీరటి ఆంజనేయులు నియమితులయ్యారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను శక్తివంచన లేకుండా పూర్తి చేస్తానన్నారు. తన నియమకానికి సహరించిన సుభద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల స్వీపర్ బలవన్మరణం

షాద్‌నగర్‌రూరల్: పాఠశాల పనులకు వెళ్తున్నాని చెప్పిన స్వీపర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం మున్సిపల్ పరిధిలోని సోలీపూర్‌లో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రమేశ్(43), లలిత దంపతులు. లలిత కూలీ పనులకు వెళ్తుండగా రమేశ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. భార్యాభర్తలు తరచూ గొడవపడుతున్నారు. దీంతో రమేశ్ తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే ఉదయం పాఠశాలకు వెళ్తున్నాని చెప్పిన ఆయన మనస్తాపానికి గురైన రమేశ్ గ్రామం సమీపంలోని రైల్వే పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ప్రమాదంలో రమేశ్ తల, మొండం వేరు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడు రమేష్‌గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్టేషన్ మాస్టర్ వెంకట్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు వెల్జాల్ విద్యార్థులు

తలకొండపల్లి: 43వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మండల పరిధిలోని వెల్జాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు పీడీ పరమేష్ శనివారం తెలిపా రు. ఈ నెల 13న సరూర్‌నగర్ స్టేడియంలో జిల్లా ఖోఖో అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ బాలికల ఖోఖో క్రీడా పోటీల్లో కె.స్పందన, ఎ.భవాని ఎంపికయ్యారని పీడీ చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ ఖోఖో చాంపియన్ షిప్ క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం నసీమ, ఉపాధ్యాయులు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

స్వచ్ఛందంగా సభ్యత్వ స్వీకరణ

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్

పెద్దేముల్: ప్రధాని మోదీ పాలనకు ఆకర్శితులై స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వం స్వీకరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రమేశ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన ఖానాపూర్, మంబాపూర్, బండపల్లి గ్రామాల్లో బీజేపీ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఖానాపూర్‌లో పత్తి చేనులో పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా రమేశ్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ పాలనలో అన్ని వర్గాల, ప్రాంతాల ప్రజల సంక్షేమంగా ఉన్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సందీప్‌కుమార్, యువ మోర్చా నాయకుడు రమేష్, సాగర్, నవీన్, గోపాల్‌రెడ్డి, అశోక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రమేశ్‌కుమార్